కూటమి పాలన అంతా మోసమే



కంభంలో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి



అర్ధవీడులో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

● మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కంభం: మహిళలకు సంక్షేమ పథకాలు అందించాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అని చెప్పే దుర్భర స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కంభంలో ఏర్పాటు చేసి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలందించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేవని 13 నెలల కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మంచి ఏమీ లేదని, అంతా మోసమేనన్నారు. రాబోయే రోజుల్లో గ్రామకమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించుకోవడం ద్వారా వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకునేందుకు మనం మందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, స్టేట్‌యూత్ వింగ్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, నాయకులు రసూల్, మహబూబ్‌పీరా, ఖాసింబి, జరీనా, పెద్దకోటేశ్వరరావు, సబ్బసాని సాంబశివారెడ్డి, సయ్యద్ సలీం, సయ్యద్ ఖాసిం, శివారెడ్డి, సూర్యప్రకాష్, సుందరరావు, ఇబ్రహీం, గురుమూర్తి, జాకీర్, ఆనంద్, రఫీ, హుస్సైన్‌బాష, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బేస్తవారిపేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ

ఇచ్చిన హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం

అర్ధవీడు: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కాకర్ల గ్రామంలో సోమవారం మండల కన్వీనర్ ఏరువ రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు మహిళకు స్త్రీ నిధి ఇస్తానని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత దాన్ని తుంగలో తొక్కిందన్నారు. కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఎవరూ భయపడాల్సిన పనిలేదని పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకట్రావు, స్టేట్ యూత్‌వింగ్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రమేష్ రెడ్డి, తెల్లకృష్ణారెడ్డి, ఖాదర్ బాష, రబ్బాని, నారాయణరెడ్డి, తిరుపతి, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరించాలి

బేస్తవారిపేట: ఏడాదిగా చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఎలా మోసం చేశాడో ప్రతి పంచాయతీలో ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక వాల్మీకి నగర్‌లోని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి గృహంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై వైఎస్సార్ సీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒకటి, రెండు సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చేందుకే రాష్ట్రాన్నే తాకట్టు పెట్టాలనే రీతిలో టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మండల ఉపాధ్యక్షులు డీ ఖాజామియా, చిరంజీవి, జిల్లా, నియోజకవర్గ అనుబంధ కమిటీల అధ్యక్షులు వెన్నా భాస్కర్ రెడ్డి, మల్లెల శేఖర్‌రెడ్డి, నాయకులు టీవీఎస్‌పీ శర్మ, దగ్గుబాటి రంగస్వామి, మిట్టాచంద్రశేఖరరెడ్డి, మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల్లో మూఢనమ్మకాలు తొలగించాలి



జేవీవీ నూతన కమిటీ సభ్యులు

మార్కాపురం: ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలు తొలగించేందుకు జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు కృషి చేయాలని జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ సూచించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జేవీవీ మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల మహసభల్లో ఆయన మాట్లాడుతూ సైన్సును ప్రజలకు చేరువ చేసేందుకు జేవీవీ కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా ఎల్వీ రెడ్డి, సమతా కన్వీనర్‌గా ఝాన్సీపాల్, పట్టణ గౌరవ అధ్యక్షుడిగా ఎల్. మురళీకృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులుగా రామాంజనేయులు, ముక్తేశ్వరరావు, ఎం.శ్రీనివాసులు, మల్లికార్జున, వై.రవికుమార్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.ప్రకాష్, జిల్లా కార్యదర్శి వీరారెడ్డి, సీఐటీయూ నాయకులు డీకేఎం రఫీ పాల్గొన్నారు.

పాఠశాల భవనం కోసం ధర్నా



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్

మార్కాపురం టౌన్: పట్టణంలోని సుందరయ్య కాలనీలో ప్రభుత్వ పాఠశాల భవనం ఏర్పాటు చేయాలంటూ కాలనీ వాసులు, విద్యార్థులు సోమవారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వచ్చి కమిషనరు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ, పట్టణ కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ కాలనీలో ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన పాఠశాలలో కొద్దిగా వర్షం కురిసినా పైకప్పు కారుతుండటంతో స్కూల్‌కు సెలవు ఇవ్వాల్సి వస్తోందన్నారు. స్కూల్ శిథిలావస్థలో ఉండటంతో పాములు, తేళ్లు వంటి విష జీవాలు నిత్యం స్కూల్ ఆవరణలో తిరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, వంటగది లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థి నుంచి 2 వేల రూపాయలు స్కూల్ అభివృద్ధికి తీసుకున్నారని, వాటిని ఖర్చు చేయాలన్నారు. కాశయ్య, జి.శారా, బుజ్జమ్మ, విక్టర్, ఎలీషా, ఆదినారాయణరెడ్డి, వందనం పాల్గొన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

అర్ధవీడు: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ జిల్లా అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జేవీవీ మండల గౌరవ అధ్యక్షుడు యం.తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 9, 10 తేదీల్లో గిద్దలూరులో జరిగే జేవీవీ జిల్లా మహాసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం అర్ధవీడు మండల జేవీవీ అధ్యక్షుడిగా ఎ.మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షుడిగా బాబురావు, ప్రధాన కార్యదర్శిగా కేసిరెడ్డి, కార్యదర్శులుగా నర్సయ్య, విజయకుమార్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఖైదీల్లో మార్పు రావాలి



జైలులో ఖైదీలకు పెట్టే భోజనం రుచి చూస్తున్న జడ్జి

గిద్దలూరు రూరల్: జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు రావాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ సెక్రటరి కె.ఇబ్రహీం అన్నారు. పట్టణంలోని సబ్ జైలును సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాన్ని జైలులో గడిపేందుకు వచ్చిన వారిలో పరివర్తన వచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఉచిత న్యాయ సేవలు పొందేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాది అహల్య, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

బేస్తవారిపేట: మండలంలోని సోమవారిపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ చేగిరెడ్డి రమణారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. తెలుగు, లెక్కల్లో పలు ప్రశ్నలు అడిగి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలలో వసతులను, రికార్డులను పరిశీలించారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు రూరల్: డెంగీ వ్యాధి మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని రాజానగర్, కొమరోలు రోడ్డుల్లో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.రమేష్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మీ కోసంలో 24 అర్జీలు

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 24 అర్జీలు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. మార్కాపురం, రాచర్ల, బేస్తవారపేట, కొమరోలు తదితర ప్రాంతాల నుంచి రెవెన్యూ సమస్యలపై బాధితులు అర్జీలు ఇచ్చారు.

అక్రమ లేఔట్లను రెగ్యులరైజేషన్ చేసుకోండి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మున్సిపల్ పరిధిలో అక్రమ లే అవుట్లను వేసినవారు రెగ్యులరైజేషన్ చేసుకునే అవకాశం ఉందని స్థానిక కమిషనర్ ఈ.వి.రమణబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30లోపు రిజిస్ట్రేషన్ పొందిన ప్లాట్లు కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్తొస్తూ ప్రమాదం

● ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

తర్లుపాడు: మండలంలోని రాగసముద్రానికి చెందిన బి.విష్ణువర్ధన్ అంత్యక్రియల్లో పాల్గొని ఇంటికి వెళ్తున్న కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ఆటో కుక్కను తప్పించబోయి కలుజువ్వలపాడు వద్ద అదుపుతప్పి కరెంట్ పోల్‌ను ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో మృతుడి తండ్రి చిన్న అంకయ్య, పెద్దనాన్న కొడుకు రాజశేఖర్, రావూరి ఏసేబులకు గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రాగసముద్రం గ్రామస్తులు విషాదంలో మునిగారు. కుమారుడుని పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రమాదం జరగడంతో గ్రామస్తులు ఆవేదన చెందారు.